క్లుప్తంగా

యాగంటి ఆలయానికి రూ.11.65 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రం ఆవరణలో ఉన్న మరుగుదొడ్ల నిర్వహణకు శనివారం నిర్వహించిన బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.11.65 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రుడు తెలిపారు. వేలంపాటలో ఐదుగురు డిపాజిట్ చెల్లించి పాల్గొనగా పాతపాడు గ్రామానికి చెందిన మధుసుధాకర్ అత్యధికంగా రూ.11.65 లక్షలకు దక్కించుకున్నట్లు ఈఓ వెల్లడించారు. వేలం పాట పర్యవేక్షణాధికారిగా హరిశ్చంద్రారెడ్డి, యాగంటిపల్లె గ్రామ ఉపసర్పంచ్ బండిమౌళిశ్వరరెడ్డి పాల్గొన్నారు.

డ్రైవర్లకు ప్రోత్సాహక బహుమతులు



ప్రమాద రహిత డ్రైవర్లకు ప్రోత్సాహ బహుమతులు అందజేస్తున్న ఆర్ఎం

కోవెలకుంట్ల: రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రమాద రహిత డ్రైవర్లకు శనివారం ప్రోత్సాహక బహుమతులు అందజేసినట్లు డిపో మేనేజర్ తిరుపతయ్య తెలిపారు. మాసోత్సవాల్లో చివరి రోజు నంద్యాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో తమ సర్వీసులో ప్రమాద రహిత డ్రైవర్లు చిన్నన్న, ప్రతాప్‌రెడ్డి, మద్దిలేటికి జిల్లా ప్రజా రవాణా అధికారిణి రజియా సుల్తానా ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీఐ కిషోర్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలను పరిష్కరించాలి



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

డోన్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను అధికారులు పరిష్కరించాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి ఆదేశించారు. ప్యాపిలి ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వస్తున్న సమస్యల్లో ఎక్కువగా రెవెన్యూ శాఖకు సంబంధించినవి ఉంటున్నాయని తెలిపారు. రెవెన్యూ అధికారులు తక్షణమే భూ తగాదాలు, రస్తా వివాదాలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భారతి, ఎంపీడీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు గ్రామంలో ఉన్న పెద్దమ్మ ఆలయం వద్ద నిత్యాన్నదాన భవన నిర్మాణానికి దాతలు రూ.50 వేల విరాళాన్ని అందజేసినట్లు నిత్యాన్నదాన సంస్థ నిర్వాహకుడు రామగంగిరెడ్డి శనివారం తెలిపారు. గోస్పాడు మండలం రాయపాడు గ్రామానికి చెందిన పెద్ద వెంకటసుబ్బారెడ్డి, చిన్నవెంకటసుబ్బారెడ్డి తమ తండ్రి సద్దల పెద్ద నాగిరెడ్డి జ్ఞాపకార్థం విరాళం అందజేసినట్లు చెప్పారు. ఈ మేరకు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి చేయండి



రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో క్లస్టర్ సమావేశం

బేతంచెర్ల: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం మల్లికార్జునయ్య, ప్రాథమిక పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల క్రమశిక్షణ, 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కుల సాధనకు తీసుకోవాల్సిన చర్యలు, మధ్యాహ్న భోజనం అమలు తీరుపై ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

బడిలో నీటి కష్టాలు

- మూలకు చేరిన మినరల్ వాటర్ ప్లాంట్లు
- మరమ్మతులపై దృష్టిసారించని అధికారులు
- ఇళ్ల నుంచి బాటిళ్లు తెచ్చుకుంటున్న విద్యార్థులు



వృథాగా ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్

కొలిమిగుండ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛమైన తాగునీరు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని సురక్షితమైన నీరు అందించేందుకు ఏళ్ల తరబడి ఉన్న సమస్యకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిష్కారం చూపింది. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా ఫస్ట్ ఫేజ్‌లో ఎంపిక చేసిన పాఠశాలలకు మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసింది. మండలంలో మొదటి విడత నాడు–నేడు కింద కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల, బెలుం ప్రాథమిక పాఠశాలతో పాటు మొత్తం 17 పాఠశాలలు ఎంపిక కావడంతో వీటికి ఆర్వో ప్లాంటులు కేటాయించారు. ఉన్నత పాఠశాలలకు రూ.9 లక్షలు, ప్రాథమిక పాఠశాలలకు రూ.1.60 లక్షలు వెచ్చించి వాటర్ ప్లాంట్‌లను మంజూరు చేశారు. కాలక్రమేణా వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో వృథాగా మారిపోయాయి. దాదాపు అన్ని పాఠశాలల్లోనూ ఆర్వో ప్లాంట్లు వినియోగంలో లేకపోవడంతో విద్యార్థులు ఇళ్ల వద్ద నుంచి వాటర్ బాటిళ్లతో తాగునీరు తెచ్చుకుంటున్నారు. స్వచ్ఛమైన తాగునీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్ల నుంచి బాటిళ్లతో తెచ్చుకున్నా అవి మధ్యాహ్న భోజన సమయానికే అయిపోతుంటాయి. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థులు పాఠశాలల్లోని బోరు నీటినే ఉపయోగించాల్సి వస్తోంది. ఆర్వో ప్లాంట్లకు చిన్న సమస్య ఉన్నా మరమ్మతులు చేయకుండా మూలన పడేయడం శోచనీయం. ఆర్వో ప్లాంట్లకు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకురావాలని విద్యార్థుల తల్లితండ్రులు కోరుతున్నారు.



ఇళ్ల నుంచి వాటర్ బాటిళ్లు తెచ్చుకున్న విద్యార్థులు

లోక్ అదాలత్‌లో సత్వర న్యాయం

- సీనియర్ సివిల్ జడ్జి తంగమణి



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న న్యాయమూర్తులు

డోన్ టౌన్: లోక్ అదాలత్‌లో దీర్ఘకాలిక సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని.. కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, న్యాయవాదులు, పోలీసులు చొరవ తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాహుల్ అంబేడ్కర్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతి అన్నారు. స్థానిక కోర్టు భవనంలో శనివారం సబ్ డివిజన్‌లోని పోలీసు అధికారులు, డోన్ కోర్టు న్యాయవాదులతో మార్చి 8వ తేదీ జరిగే లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ.. కక్షిదారులు రాజీ అయ్యే కేసులు ఉంటే లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవడం ఉత్తమం అని తెలిపారు. ఈ విషయం కక్షిదారులకు తెలియజేసి అత్యధిక కేసులు పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, న్యాయవాదులు ఆలా శ్రీధర్, శేషశయ శర్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి అన్నారు. పట్టణ సమీపంలోని శ్యాంజో స్కూల్‌లో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యా ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ప్రణాళికా బద్ధంగా విజయం సాధించాలని సూచించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలన్నారు.

విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించాలి



మాట్లాడుతున్న ఎంఈఓ అబ్దుల్ కలాం

కొలిమిగుండ్ల: ప్రతి విద్యార్థికి నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించాలని ఎంఈఓ అబ్దుల్ కలాం అన్నారు. శనివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో క్లస్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖ ఇచ్చిన మార్గదర్శకాలు, సూచనలను తూచ తప్పకుండా అమలు చేయాలని తెలిపారు. ఏ పనైనా విజయవంతం కావాలంటే సమష్టి కృషి, సమన్వయం అవసరమన్నారు. క్లస్టర్ సమావేశాలు విద్యాభివృద్ధికి దోహదపడుతాయని పేర్కొన్నారు. విద్యారంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ ఒక కుటుంబమనే వాతావరణంలో మెలగాలన్నారు. ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థి అన్న భావన ఏర్పరచుకుని వృత్తి నైపుణ్యం పెంచుకోవాలని సూచించారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

డోన్ టౌన్: పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ–2 రామనర్సప్ప అన్నారు. శనివారం పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన క్లస్టర్ సమావేశానికి హాజరయ్యారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులకు సూచించారు. హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి, నోడల్ ఆఫీసర్ రామాంజనేయులు, రీసోర్స్ పర్సన్స్ సుబ్బారెడ్డి, వెంకటరమణ, అల్లీపీరా, లక్ష్మీకాంతరెడ్డి, రఘునాథ్, శ్రీనివాసులు, దేవేంద్రప్ప, ప్రసాద్, శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిప్యూటీ డీఈఓకు సన్మానం



డిప్యూటీ డీఈఓను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కోవెలకుంట్ల: స్థానిక ఎంఈఓగా పనిచేస్తున్న వెంకట్రామిరెడ్డికి డోన్ డిప్యూటీ డీఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించడం హర్షణీయమని రాష్ట్రోపాధ్యాయ సంఘం నాయకుడు జీవీఎస్ ప్రసాదరెడ్డి అన్నారు. కోవెలకుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం డిప్యూటీ డీఈఓను పాఠశాల హెచ్ఎం రాజయ్య, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఎంఈఓగా విధులు నిర్వర్తిస్తున్న వెంకట్రామిరెడ్డి విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేస్తున్నారని గుర్తించి విద్యాశాఖ జిల్లా ఉన్నతాధికారుల సిఫారసు మేరకు ప్రభుత్వం డిప్యూటీ డీఈఓగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటసుబ్బయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు చౌడేశ్వరిదేవి ఆలయ వార్షికోత్సవం

కొలిమిగుండ్ల: రాఘవరాజుపల్లె సమీపంలోని శక్తిపురం చౌడేశ్వరిదేవి ఆలయంలో సోమవారం మొదటి వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు రామయ్యస్వామి తెలిపారు. గణపతి పూజ, కలశ స్థాపన తదితర పూజలు నిర్వహిస్తామని చెప్పారు. అమ్మవారికి అభిషేకం, చండీ పారాయణాలు, చండీహోమం, కుంభాభిషేకంతో పాటు విశిష్ట పూజల అనంతరం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు చౌడేశ్వరీదేవి జ్యోతుల మహోత్సవం జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–జమ్మలమడుగు ఆర్అండ్‌బీ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. శనివారం ఎస్ఐ మల్లికార్జునరెడ్డి అందించిన సమాచారం మేరకు.. మండలంలోని గుళ్లదూర్తి గ్రామానికి చెందిన నవీన్ సొంత పనుల నిమిత్తం శుక్రవారం రాత్రి కోవెలకుంట్లకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతున్నాడు. మరోవైపు తెలంగాణ రాష్ట్రం నిజామబాద్‌కు చెందిన పప్పుశనగ కోత నూర్పిడి యంత్రం డ్రైవర్ రిషికేశ్వర్‌రెడ్డి మరో బైక్‌లో వస్తూ కోవెలకుంట్ల సమీపంలో ఇద్దరూ ఢీకొన్నారు. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం నంద్యాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు

కోవెలకుంట్ల: పట్టణంలోని సంతమార్కెట్ సమీపంలో రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాద ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని జోళదరాశికి చెందిన రామక్క(75) గురువారం సొంత పనుల నిమిత్తం కోవెలకుంట్లకు వచ్చింది. రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. మెరుగైన వైద్యం కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రేపు మారెమ్మ ఆలయ వార్షికోత్సవం

కోవెలకుంట్ల: పట్టణంలోని అంకాలమ్మ చౌరస్తాలో వెలసిన మారెమ్మ ఆలయ రెండో వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి పంచామృతాభిషేకం, అభిషేకాలు, తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ఎస్సీ హాస్టల్‌ను పునర్ నిర్మించాలి



కళాశాల హాస్టల్‌లో వసతులపై ఆరా తీస్తున్న బాలనాగన్న

కోవెలకుంట్ల: పట్టణంలో గతంలో ఉన్న ఎస్సీ హాస్టల్‌ను పునర్‌నిర్మించాలి డీవీఎంసీ సభ్యుడు బోధనం బాలనాగన్న అన్నారు. శనివారం రాత్రి స్థానిక ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్‌లో వసతులపై వార్డెన్ అల్లాబకాష్‌ను అడిగి తెలుసుకున్నారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఎస్సీ హాస్టల్‌ను 2019కి ముందు ఎత్తి వేశారని, తిరిగి హాస్టల్‌ను పునర్ నిర్మించేందుకు జిల్లా అధికారులతో మాట్లాడి కృషి చేస్తామని పేర్కొన్నారు. విద్యార్థి సంఘం నాయకులు మాబు ఉసేన్, మద్దిలేటి, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో స్వచ్ఛ ప్రతిజ్ఞ

డోన్: పట్టణంలోని వంద పడకల ప్రభుత్వాస్పత్రిలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హనీఫ్ వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



వైద్య సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న సూపరింటెండెంట్

శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు



సర్టిఫికెట్లు అందుకున్న పొదుపు మహిళలు

బనగానపల్లె రూరల్: స్థానిక డీఆర్‌డీఏ వెలుగు కార్యాలయంలో పొదుపు మహిళలకు స్వయం ఉపాధిపై నిర్వహించిన మూడు రోజుల శిక్షణ తరగతులు శనివారం ముగిశాయి. చివరి రోజు ముఖ్య అతిథిగా జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పొదుపు మహిళలు శిక్షణ నేర్చుకున్న వాటిని ఆచణలో పెట్టాలన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధించాలని సూచించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న 55 మంది మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ శ్రీధర్‌రావు, స్వర్ణబాబురావు, డీఆర్‌డీఏ ఏపీఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

అవుకు: మండల కేంద్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామివారికి ఆలయ అర్చకులు అభిషేకం చేసి ప్రత్యేకంగా అలంకించారు. భక్తులు స్వామివారికి ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయాభివృద్ధికి రూ.లక్ష విరాళం

బనగానపల్లె: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయ అభివృద్ధికి నంద్యాల పట్టణానికి చెందిన డాక్టర్ విద్యారెడ్డి కుటుంబ సభ్యులు కేజీ వెండి పాత్ర,రూ.లక్ష విరాళంగా అందజేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా దాతకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ మాజీ చైర్మన్ పీవీకుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



విరాళం అందజేస్తున్న దాత విద్యారెడ్డి

ప్రైవేట్ విద్యాసంస్థలపై ఫిర్యాదు

డోన్ టౌన్: వార్షికోత్సవాల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను ప్రైవేట్ విద్యా సంస్థలు లూటీ చేస్తున్నాయని ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు తెలుగు విజయ్‌కుమార్ ఆరోపించారు. శనివారం డిప్యూటీ డీఈఓ కార్యాలయం అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని తెలిపారు. పుస్తకాలు, విద్యాసంస్థల వార్షికోత్సవం అంటూ తల్లిదండ్రుల వద్ద అధికంగా నగదు వసూలు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు.

24 నుంచి సువార్త స్వస్థత మహాసభలు



డోన్: పట్టణంలోని సమైక్య క్రైస్తవ కమిటీ హాల్‌లో ఈనెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు సురక్ష సువార్త స్వస్థత మహాసభలు నిర్వహిస్తున్నట్లు పాస్టర్ పాల్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు శనివారం క్రైస్తవ సంఘం నాయకులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. పాస్టర్లు డేవిడ్, ప్రకాష్, జాన్‌విక్టర్, రాజారత్నం, దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న క్రైస్తవులు

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

డోన్ టౌన్: కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రాజేష్ అన్నారు. శనివారం స్థానిక బ్రాంచ్ కార్యాలయంలో ఖాతాదారుల సమావేశం నిర్వహించారు. ప్రధాన మంత్రి బీమా యోజన పథకం కింద అతి తక్కువ ప్రీమియంకు రూ.2 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం ఉంటుందన్నారు. ఆడ పిల్లల కోసం జీవన్ సుఖన్య, జీవన్ సమృద్ధి యోజన తదితర పథకాలపై అవగాహన కల్పించారు. ముద్ర రుణాలు, పంట రుణాలు తీసుకున్న వారు సకాలంలో తిరిగి చెల్లిస్తే మళ్లీ మంజూరు చేస్తామని తెలిపారు. బ్యాంక్ ఉద్యోగులు సురేష్, గోవింద రాజులు, శ్రీనివాసులు, మోహన్, భాస్కర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం



బనగానపల్లె: చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి

బనగానపల్లె రూరల్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యకర జీవనం సాధ్యమని నియోజకవర్గ ప్రత్యేక అధికారి రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం బనగానపల్లె పట్టణంలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం నుంచి ఉద్యోగులు, విద్యార్థులతో కలిసి ప్రభుత్వ వైద్యశాల, పెట్రోల్‌బంక్ మీదుగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అపరిశుభ్రత కారణంగానే వ్యాధులు ప్రబలుతున్నాయని.. ప్రజలు ఎక్కడపడితే అక్కడ చెత్త పడేయకుండా గ్రామ పంచాయతీ అధికారులు సూచించిన ప్రదేశంలోనే చెత్తను వేసి సహకరించాలని కోరారు. పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు చేశారు. ఎంపీడీఓ వెంకటరమణ, మండల ప్రత్యేక అధికారి సుబ్బారెడ్డి, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఈఓ సతీష్‌కుమార్ రెడ్డి, ఏపీఎం శ్రీనివాసులు పాల్గొన్నారు.

కార్యాలయాల్లో పారిశుద్ధ్య పనులు

కోవెలకుంట్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల రోగాలు దరిచేరవని ఎంపీడీఓ వరప్రసాదరావు, తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యాలయాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అలాగే ఎక్సైజ్ కార్యాలయ ఆవరణలో ఆ శాఖ సీఐ తకీబాషా, ఎస్ఐ సందీప్‌యాదవ్ ఆధ్వర్యంలో పరిసరాలను శుభ్రం చేసి తడి చెత్త, పొడిచెత్త, డ్రైవేస్ట్‌ను వేరుచేశారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్లే దోమలు విజృంభించి రోగాలు ప్రబలుతున్నాయన్నారు. ఎవరి పరిధిలో వారు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



బేతంచెర్లలో శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణలో శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

బేతంచెర్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్, నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్, వైద్యులు చరణ్‌రాజు, వాణి స్వప్న ప్రియ అన్నారు. నగర పంచాయతీ సిబ్బందితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాలతో పాటు శేషారెడ్డి సీహెచ్‌సీ ఆవరణలో చెత్తను తొలగించారు. తడిచెత్త, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియపై అవగాహన కల్పించారు. అలాగే ఆర్ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం మల్లికార్జున ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

విద్యార్థులకు అవగాహన

డోన్ టౌన్: పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై హెచ్ఎం వెంకటసుబ్బారెడ్డి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి నెలా మూడో శనివారం పరిశుభ్రతపై ప్రత్యేక కార్యక్రమం ఉంటుందన్నారు. తడి చెత్త, పొడి చెత్త, ప్రమాద వస్తువులు విభజించి ఆకుపచ్చ, నీలం, ఎరుపు రంగు డబ్బాల్లో వేయాలని సూచించారు. ప్రతిఒక్కరూ వీటిపై అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటరమణ, బాబుసుభాన్, దేవేంద్రప్ప, ఆదినారాయణ పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

డోన్: స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్యాపిలిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సర్కిల్ వద్ద స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పరిసరాల్లో చెత్తను ఇష్టానుసారంగా వేయరాదన్నారు. చెత్తను చెత్తకుండీల్లో మాత్రమే వేయాలని తెలిపారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పేరుకుపోయిన చెత్తను అధికారులు తొలగించారు. స్థానిక ఎమ్మార్సీలో ఎంఈఓ వెంకటేశ్ నాయక్, సిబ్బంది శ్రమదానం చేసి కార్యాలయాన్ని శుభ్రపరిచారు. ఈఓఆర్డీ బాలకృష్ణుడు, ఆర్అండ్‌బీ ఏఈ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్ గౌడ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న హెచ్ఎం



ప్యాపిలిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు